"అవునమ్మా! అందరిదగ్గరా ఇలా అప్పులుచేసి తీర్చకపోతే అనరూ? ఎన్నాళ్ళనీ ఇలా?" అంది గంగ.

"నోర్ముయ్! పళ్ళూడేను. వెళ్ళు లోపలికి!" అంటూ గుడ్లురుమి చూసింది సుందరమ్మగారు.

ఇది జరిగిన వారానికి రఘు వచ్చాడని తెలిసి వాళ్ళింటికెళ్ళాడు రాజారావు. లోపలేదో పని లోవున్న సుందరమ్మగారు ఆదరాబాదరా వచ్చి అంది.

"విన్నావా రాజా! ఆ మాయ ముండా కొడుకు సంగతి. వారంరోజులా వుంచుకుని, కాళ్ళుచేతులూ పట్టుకు బ్రతిమాలాట్ట వచ్చే నెల్లో రమ్మని!"

రాజారావు తెల్లబోయాడు!

"వాడిమాట నమ్మి నీకు మాటిచ్చాను. పెద్ద మనిషివి! మాట దబరా అయింది. ఇలా అయితే పరపతు లుంటాయా?" అని మళ్ళీ అంది.

రాజారావు మరీ తెల్లబోయాడు! ఏడ్చేది తనైనా, అందుకు ప్రయత్నిస్తూన్నట్లు కన్పించే వాళ్ళను ఓదార్చాలిగా!

"ఆ! ఇప్పుడేమైంది. వున్నప్పుడే ఇద్దురుగాని" అంటూ ఓదార్చేడు.

సుందరమ్మగారు ఓ పొలికేక పెట్టింది "గంగా! రాజా వచ్చాడు. కోకో తీసుకురా!" అంటూ.

"అబ్బబ్బ! వద్దండి. కోకో నాకలవాట్లేదు. వస్తా" అంటూ లేచి దబదబా మెట్లుదిగి రోడ్డు యెక్కాడు రాజారావు.

* * *

నెలలు గడిచినయ్. రాజారావు రఘుకోసం వెళ్తూనేవున్నాడు. సుందరమ్మగారు తీర్చని బాకీదారుల్నీ, పండని భూముల్నీ దుమ్మెత్తిపోస్తూనే వుంది. రాజారావుచేత బలవంతాన కోకోవో, ఓవల్టైనో తాగిస్తూనే వుంది.

రాజారావు భార్యకూడా అంది ఓసారి. "సుందరం పిన్నిగారు అసలు రావడమే మానేసింది. ఎందుకనో?"

"ఎందుకు లెద్దూ. వచ్చిందగ్గరనుండే అవీ ఇవీ తెస్తుంది. మళ్ళీ మనం తీర్చాలా ఏమన్నానా?" అన్నాడు రాజారావు భార్యకు ముఖం చాటు చేసుకుని పాపం!

కాని రాజారావు భార్యకు అందులోని అంతరార్థం తెలిస్తేగా!

---

స్కెచ్

# లవంగాల పిల్ల

"ర మ ణ శ్రీ"

మమతలూ, అభిమానాలకూ హేతువులని ప్రశ్నించే అంతస్సుకి జవాబుగా ఎవరో ఒక వ్యక్తి నిలబడుతుంటారు! ఆ వ్యక్తిలో శక్తి మనలను ఆకర్షించేటంత ఉత్సాహంగా వుంటుంది. ఏమో! ఆ అమ్మాయి నెవరెరుగుదురు? చూచిన తొలిచూపులోనే, నేత్రనాళంలో రక్తాన్ని ఉద్రేకపరచింది! ఆ ఆకర్షించే జీవం, భగవద్దత్తమైన ప్రత్యేక సమాకర్షణలో—నక్షల్లేని చెవులూ, నిరలంకారమైన నాసిక, అమాయికపు నవ్వు— నిశ్చలమైన చూపులో నిద్ర— హృదయాన్ని పులకరింపజేస్తాయని ఎవరూహించారు?

ఆ అమ్మాయి చిన్ని చెవి రంధ్రాల్లోంచి, లవంగాలు తీసేస్తూ, "ఎవరునువ్వు? ఎందుకు నవ్వు?— చెవుల్లో లవంగాలు పెట్టావే?— దుద్దుల్లేవూ?" అన్నాను.

చేతులూపింది లేవనేసైగగా. పైగా నవ్వుతూ పెదవుల్ని ధనువుల్లా వంచి, నిర్లక్ష్యంగా నవ్వింది. ఆ నవ్వు నాకు జవాబుకాదు సరిగదా! అధిక్షేపణగా ఎదురొచ్చింది, మళ్ళీ చెవి రంధ్రాల్లో లవంగాలు దూరుస్తూ, "ఇంకా అజ్ఞానంలో కొట్టుకొంటోన్న కళ్ళువిప్పని, అజ్ఞాత సౌందర్యం కాబోలు!" అన్నాను. ఆ మాటలు మళ్ళీకొత్తగా వినిపించి, పకపక నవ్వింది.

సంధ్య. సువాసనకి అలసిన చల్లనిగాలి. వీటి మధ్యలో ఏకాంతంగా వున్నాను. అటూ ఇటూ ఇంట్లోజనం హడావిడిగా మసులుతూనేవున్నారు.

నేనా అలజళ్ళజల్లులో పొల్లోకండా, పైకెక్కి వచ్చేశాను—దిశాకాంత ముఖంమీద, సాంధ్య తిలకం, పచ్చని పెళ్ళికూతురి బొట్టుకి ఈడౌతూ, చీకటిని చీదరించుకొంటూ వుంది.

ఆ చెవుల్లో లవంగాలపిల్ల, దీక్షగా ప్రకృతి రహస్యం తనకి తెలుసునన్నట్టు, అవలోకిస్తోంది.

దగ్గరికి లాక్కుని, "ఎవరమ్మాయివి?"—చిట్టి తలకట్టు నిమురుతూ అన్నాను. "ఇంకా భాషా, విజ్ఞానం మాలో వికసించలేదు. అయితే ప్రకృతి సహజత్వంలో వికసించి వూరుకొన్నాం" అన్నట్టు ఆ పిల్లకళ్ళు కదుల్తూ, ఆకాశాల్ని త్రిప్పుకుంటూ నాప్రశ్న వైపు పరిశీలించి చూచినయ్! ఈసారి, కళ్ళల్లోనే నందివర్ధనపుష్పాల్ని గుత్తులు గుత్తులుగా నవ్వుతూ పెదవుల్ని అరుణరాగంలో విరియించింది.

"నీకు మాటలురావూ?" అన్నాను.

"మాతలొచ్చు" అంటూ బుర్రవూపింది. ఏవో మాట్లాడితీరాలనే కౌతూహలాన్ని ప్రతిముఖావయవంలోనూ విస్పష్టం చేసింది. అన్నిటినీ మించి చిన్నిహృదయంలో సిగ్గుతెరల్లోంచి చూస్తూ, "నువ్వెవలూ?" అంది.

"నువ్వెవరో ముందుచెపుతే"—అన్నాను.

ఊహతెలిసిన మనసులో అర్థాన్ని దాచుకుంటూ, నవ్వులో మాటలమాధుర్యాన్ని దోచుకుంటూ, ఏదో వెకిలిసంజ్ఞ చేసింది. చెవుల్లో లవంగాలు చూపెట్టి "జుజ్జులు పోయాయి" అంది.

"అయ్యో పాపం" అన్నాను.

"నీ పేరు చెప్పు చాకలెట్టు పెడతా" అనేసరికి, "ముందు పెత్తు తలవాత తెపుతా"...అంది. ఆ మాటల్ని వేయిన్నొక్కసారి వినాలనిపించింది. ఆ ముద్దుమాటలు, జగత్తుని జోలపాడి, "ఇదిగో సంగీత సారస్వతాలరసాలన్నీ మాముఖతః జనిస్తాయ్! మా పలుకుబడిని త్రవ్వుకొన్న మాధుర్యం మీకెక్కడ లభిస్తుంది?" అని సవాలుచేస్తున్నటనిపించింది.

రాను, రాను నా ఆంతర్యాన్ని కళ్లల్లోంచి పరిశీలించసాగింది.

"నీ పేరు చెప్పవూ?" అన్నాను బుజ్జగిస్తూ బాగా దగ్గరికిలాక్కున్నాను. నీలిమబ్బు జుబ్బా, జుబ్బా అంచుల్ని అంటుకొన్ని చమ్కీ- చిట్టి తలకట్టులో పాయలై, Xంగా యమునలమల్లే రెండుజడలూ—

"ఊహుఁ...ఊహుఁ.." అని రెండుసార్లు తల వూపింది. ఏదో చెప్పలేని మూగభాష అభిమానంతో అనురాగంతో గూళ్లుకట్టుకుంటూన్న హృదయం, పచ్చికబయల్లో సన్నగా వచ్చీరాని గెంతులేసే లేడిపిల్ల చాలుగా ఆ అమాయికమైన కళ్ళతో అడుకుంటోంది.

చీకటిని తప్పించుకోలేని, ప్రకృతి దేవుడు విధించే శిక్షను శిరసావహిస్తోంది. గాలి ఉన్నట్టే ఉండి ఒక్క ఊగుఊగి ఆగింది. ఆ పిల్ల దృష్టినించి మళ్ళించుకో లేకపోయేనా అశక్తతని అనుమానించను. జనం, అటూ యిటూ తిరుగుతున్నారు. క్రిందనించి కేకలు వినిపించుతున్నయ్...!

ఏదో, అజ్ఞాస్వరం మేడమెట్ల దగ్గర్నుంచి, ప్రతిధ్వనించింది. ఆ అమ్మాయి ఏ లోకంనించో త్రుళ్ళిపడింది.

"మాఅక్క, మాఅక్క" అంటూ పారిపోబోయింది.

నేను వెళ్ళి పట్టుకొన్నాను. దిగనివ్వలేదు. ఎవరో ఎత్తుగావున్నావిడ పైకి వచ్చింది గొంతు పెద్దది చేసుకుంటూ, "అసి దొంగపీనుగా? ఇక్కడేడుస్తున్నావా? నీకోసం ఇల్లంతా తిరకలేక చచ్చాను!" అంది.

అమ్మాయి ముఖం బిక్క చచ్చిపోయింది. ఇంతలోనే ఎంత మార్పు! ఆ మార్పుతో నావైపు శరణన్నట్టు చూసింది.

"ఏవవకండీ! పాపం ఇప్పటికే భయపడిపోయింది" అన్నాను. "ఈ పిల్ల సంగతి మీకు తెలీదండీ! వత్తి రాలుగాయి పాప-ముప్పు తిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తుంది" అంది ఆవిడ. ఏదో కోపంగా నవ్వింది. ఆ నవ్వుచూచి పిల్లా నేనూ భయపడ్డాం.

ఆ అమ్మాయి కిందికి వెళ్ళిపోయింది. కాదు కాదు! ఆ ఎత్తుటావిడ కిందికి బరబర ఈడ్చుకుంటూ పోయింది.

నే నాలోచించాను. చీకటిని చీల్చాలనే కిరణానికుండే శక్తి ఆ శక్తిలో ప్రసరించేరంగు-ఆ అమ్మాయి కొందరికి వెగటుకూడా అనే ఆలో

చన, నన్ను సంకుచిత పరిచింది. నేను ఆ పిల్లని గురించి, ఏలాగూ భావించలేక పోయ్యాను. క్రిందికి దిగి వెళ్ళేసరికి ఆ అమ్మాయి వీపుమీద, ఛడేల్ ఛడేల్ మని దెబ్బలు పడుతున్నయ్.

ఆ చెవుల్లో లవంగాల పిల్ల ఏడుస్తూ, నావైపు ముఖం తిప్పి ముడుచుకొంది. నేనేం మాట్లాడ లేదు. ఓదార్చలేదు. ఆ వైపు చూడనన్నా లేదు. ముందుకు సాగిపోయాను.

ఆడా మగా అంతా పక్కలువేసి సిద్ధంచేసుకుంటున్నారు. ఎందుకోగాని, తిరిగి ఆ వైపే వెళ్ళాను. ఆ అమ్మాయి నిశ్చలంగా సౌందర్య ముద్రలో కూర్చుని వ్యక్తుల్ని పరీక్షిస్తోంది. ఆ కళ్ళనేమిటోగాని, పరిశీలనీయ వస్తు దృక్పథాన్ని తప్పించుకోలేదనుకొంటాను. కొండల్ని, కోనల్ని, అందాల ఆకాశాల్ని వర్షించిన మేఘాల్ని చీల్చి ప్రకృతిలో దాగున్న రహస్యాన్ని సమీక్షించుకోడానికి, ఆ రెప్పలు సౌందర్య లోకానికి ద్వార బంధాలు వేస్తయ్!

దగ్గరికి వెళ్ళాను.

"నువ్వు చూచావ్" అని పక్కకుర్చీ చూపెట్టింది. అటువంటి పరిపూర్ణమైన ఆదరణ ఇంత వరకూ నాకెవ్వరూ ఇవ్వలేదు. రెండో సారి. "నువ్వూ చూచావూ?" అంది.

ఆ రెండు కళ్లూ వర్షించిన మేఘాలమల్లే కాంతిల్లినయ్! కొంత సేపటికి నిద్రకి ఆగలేని, రెప్పలు కిందకి దిగజారిపోతూ, సౌందర్యానికి ద్వారబంధాలు వేసివేశాయి.

ఆ ఎర్రటావిడ వచ్చింది. "సిగ్గులేనిముండ! ఛీ ఎక్కడపడితే అక్కడ మొద్దులా నిద్రపోతుంది" అంటూ తీసుకెళ్ళి పక్కమీద పారేసింది.

నేను నిట్టూర్చాను. ఆవిడ, పిల్లమీద ద్వేషాన్నా? అభిమానాన్నా? సంరక్షణావశ్యకతనా చూపుతోంటు? అర్థంకాలేదు.

ఎప్పుడు తెల్లవారిందో తెలీదు. నేనింకా పక్కమీదున్నాను. ఆ అమ్మాయి ఎదురుగుండా నిల్చొనివుంది, జోబినిండా వాక్కాయలు.

"తినకూడదమ్మా! పారెయ్, అక్క దెబ్బలాడుతుంది" అన్నాను నిద్రమెళుకువలోనే!

ఆ వాక్కాలన్నీ, సూదీదారంతో గుచ్చుతోంది.

ఏవిటన్నాను, "దండ...వాక్కాయలదండ" అంటూ పరుగెత్తి పారిపోయింది.

నేను కాలకృత్యాలు తీర్చుకొనివచ్చేసరికి, ఆ అమ్మాయి చేతిలో మిఠాయి ఉండతో నించొని వుంది. చుట్టూ పిల్లలు కాకుల్లా కాచుక్కూర్చునివున్నారు ఆ మిఠాయికోసం.

ఆ అమ్మాయి, అవసరపుగావున్నపుడు, ఎవరో పెంకిపిల్ల గెద్దలా తన్నుకుపోయింది. వీరస్త్రీకి మల్లే వారితో పోరింది. వాళ్లు పదిమంది, తనొక్కత్తి. ఓడిపోతూ నాదగ్గరికి పరుగెత్తుకొచ్చింది.

"మాత్త్రావ్వూలుకొన్నావా? మిఠాయుండ... మిఠాయుండ..." కళ్ళల్లో మేఘాలు ఊరుముతూ దుఃఖిస్తున్నయ్!

"పోన్లే మరోహాటి కొనుక్కుందువుగానిలే" అన్నాను.

ఎక్కణుంచో తెచ్చిచ్చాను. రెండుఖాజాలు రెండు మిఠాయుండలూ—ముఖం సంతోషంతో విప్పారింది. వాళ్ళందరివైపు అహంకారగర్వంతో చూపుల్ని ప్రసరిస్తూ, "మిమ్మల్ని ఓడించాను." అన్నట్టు విజయవంతంగా చూచింది.

ఆ ఎర్రటావిడవచ్చి, అవన్నీ లాక్కొంటూ, "అమ్మనాయినో! మనిషివా దున్నవా? ఇవన్నీ తింటే ఇంకేమయినా వుందా? జబ్బుచేస్తే ఎవడు చేస్తాడే? చాకిరీ!—ఎవడే నీకిస్త ఇవన్నీ" అని దూషిస్తూ పిల్లని లాక్కుపోయింది.

నేను వెనకాలే వెడుతూ "పాపం కొట్టకండి! ఏడుస్తుంది" అన్నాను. ఆవిడ విచిత్రంగా నవ్వుతూ, "మీకు తెలీదండీ! ఇవన్నీ తింటే బాగు పడుతుందా? ఎవళ్ల దగ్గరైనా, ఏదిపడితే అది పుచ్చేసుకుంటుంది! వెధవది" అంది.

అంతా ప్రయాణమై వెళ్ళిపోతున్నారు. ఆ అమ్మాయికూడా నవ్వుతూ వెళ్ళిపోతుంది. ఎప్పుడొచ్చిందో ఏమో నేను చూడనేలేదు ఆ వాక్కాయలదండ కాస్తా నా మెడలోవేసి, తుర్రున పారిపోయింది.

ఆ వాక్కాయల దండలో నిర్మించిన మమతలూ, అభిమానాల ఆదర్శం ఎప్పుడైనా మర్చిపోగలనా? అది నిజంగా వాక్కాయలదండ కానే కాదు. మనోవాక్కాయ కర్మలయొక్క సమ్మితత్వాన్ని సంస్కరించుకొన్న ప్రేమోపహారం!★